# నాకేం మిగిలింది?



పొట్లూరు నిర్మలాదేవి

అలవాటు చొప్పున మార్నింగ్ వాక్‌కి బయల్దేరాను. వినాయకుడి గుడి దాటాక కృష్ణగాలి రివ్వున కొట్టింది.

శివరాత్రి ఇంకా వెళ్ళకపోవడాన బాగా చలి అనిపిస్తూంది. పేవ్‌మెంట్ మీద పాదాలు యాంత్రికంగా సాగిపోతున్నాయి. అప్పటికే సిటీబస్‌లు తిరుగుతున్నాయి. ఎంత మారిపోయింది సిటీ. బెజవాడ పదేళ్ళక్రితం ఇలా లేదు. ఏంతోదూరం అయితేగాని బస్ ఎక్కడం. అలాటిది ఫర్లాంగుదూరం అయినా సరే సిటీబస్ కోసం వెయిట్ చేస్తున్నారు. బ్యారేజీ దాటాక స్నానాలురేవు దగ్గర ఆగాను. నా చిన్నప్పుడిక్కడ రోజూ సాయంత్రం ఉదయం కూడా ఆడుకునేవాళ్ళం. రాజ్యం, నేనూ తలలు తడిపేసుకెళ్ళి రోజూ చివాట్లు తినేవాళ్ళం. ఇంట్లో అలిగినా ఈ చెట్టుక్రిందే మకాం. 'రాజ్యం' హఠాత్తుగా గుర్తొచ్చింది. ఏం చేస్తుందో ఇప్పుడు. హాయిగా పెళ్ళి చేసుకుని పిల్లా జెల్లాతో కాలక్షేపం చేస్తుందేమో ఏమో. గతంమరచి అంత తేలిగ్గా బ్రతుకు వెళ్ళదీస్తుందన్న నమ్మకం కలగటం లేదు. అసలా అపనమ్మకం ఈరోజే కలిగింది.

ఆ విషయం ఆలోచించడానికి టైమేదీ·

యాంత్రికంగా మారిపోయిన తనకీ ప్రయాణంలో ఏమూలో దాక్కున్న మానవత్వపు విలువ మసక మసగ్గా విప్పించసాగింది. ఆఫీసు, ఆ గొడవలూ పార్టీలు క్లబ్బులూ, ఆ లోకం నుంచి అక్కయ్య కూతురి పెళ్ళి వంకతో ఓ విధంగా తెరిపిన పడినట్లుగా ఉంది. గుండెల నిండా కృష్ణగాలి పీల్చుకున్నాను. మరో రెండడుగులు వేశాక చూశాను ఎవరో అమ్మాయి. దూరాన్నుంచి రాజ్యం అనుకున్నాను. ఏదో ఆశ తళుక్కుమంది.

ప్రక్కనుంచే వెళ్ళిపోయింది. ఊహూ తను కాదు. తన పిచ్చిగాని తనని చూసినా ఇదివరలోలాగా అంత ఆప్యాయంగా పలకరిస్తుందా.

సరిగ్గా పదేళ్ళక్రితం ఇదే చెట్టు కింద కూర్చున్నాడు తను. దాదాపు అనుకున్నట్టే కూర్చుని చెపుపేపు మొహం పెట్టుకుంది రాజ్యం. ఆమె కళ్ళలో మరో కృష్ణవేణి పొంగిపొరలుతూంది. "కేశవా నువ్వెళ్ళాక నేను గుర్తుంటానా?" చాలాసేపటికి అనగలిగింది ఆ మాట.

"ఛ ఛ ఏం మాట అది. నువ్వెప్పుడూ నా గుండెల్లోనే ఉంటావు. వేరె గుర్తు పెట్టుకోడం దేనికి" ఓదార్పుగా అన్నానేగాని నాకూ కన్నీళ్ళాగలేదు.

"నిన్నే నమ్ముకున్నాను కేశవా. నీ ధైర్యం చూసుకునె బామ్మని నాన్ననికూడా ఎదిరించేందుకు సిద్ధపడ్డాను. ఎంత తొందరలో మన పెళ్ళి విషయం మాట్లాడితే అంత మంచిది". ఆ గొంతులో ఎంత విశ్వాసం.

'నన్ను నమ్మవూ.'

ఆ రోజలా అన్నానేగాని మాట నిలుపుకో గలిగానా. ఆనాటి నుంచీ ఈనాటివరకూ రాజ్యం గురించి ఆలోచించే తీరికేదీ. కానీ నాదో ధైర్యం. నేను మోసం చేయలేదు. ఇద్దరికీ ఇష్టమైంది ప్రేమించుకున్నాం. పెళ్ళి అనేది మా చేతుల్లో లేదుగా.

యూనివర్శిటీలో సీటు రావడం విశాఖ వెళ్ళడం అట్నుంచటే రిసెర్చికి స్టేట్స్‌కి వెళ్ళడం ఒదో వ్యాపకంలాగా అనుకోకుండా అదృష్టం కలిసొచ్చినట్టు జరిగిపోయింది.

ఆ వెళ్ళడం నాకు అపకారమేం జరగ లేదు. ఎందుకంటే నేనే అక్కడికి వెళ్ళ కుంటే లత నాకెలా తటస్థపడేది. అది నా లక్. దైవవశాత్తూ ఆమె నా అర్ధాంగి కావడం కలలోలా జరిగిపోయింది. జరిగిం దానికి నేనేం బాధపడను. పైపెచ్చు చాలా గర్విస్తాను. ఆమె నాలాగే ఒక ప్రొఫెసర్. విశాల భావాలున్న వ్యక్తి. అమృత హృదయం అంటే ఆమెకే చెల్లుతుంది. పూర్ ఫెలో రాజ్యంని గనుక చేసుకుంటే ఏంమిగులుతుంది బూడిద. పైపెచ్చు వర్ణాంతరం అంటూ అదో అపవాదు. ఆపద తొలిగినట్టుగా నిట్టూర్చాను. మంచు మేలిముసుగేసుకున్న కృష్ణ మీద రెక్కలు ముడుచుకున్న కొంగల్లా దూరాన్న పడవలు ఒకటీ అరా కన్పించ సాగాయి.

తలతిప్పి చూశాను. ఎవరో ముసలతను. ఎవరది.

ఆ. అవధానిగారు కదూ. రాజ్యం నాన్నగారు.

అదేవిటి. విషప్పురుగును చూసినట్టు చూసి వెళ్తారు. అయితే నన్ను గుర్తించారన్న మాట. పిలవబోయిన నా నోటిని ఎవరో నొక్కి పట్టేసినట్టు ఆపేశాను. నా పట్ల అంత తిరస్కార భావమున్న అతన్తో ఏం మాట్లాడాలి.

రాజ్యం కనిపిస్తే బావుణ్ను. ఎవర్నైతే మర్చిపోదామని ప్రయత్నిస్తున్నానో అదేవ్యక్తి పదే పదే గుర్తువస్తున్నదేవిటో.

టైంచూస్తే తొమ్మిది కావస్తున్నది. లత ఎదురుచూస్తూ ఉంటుందేమో. వెనక్కి వో పది గజాలు నడిచానేమో. బాగా తెలిసినట్టున్న మొహం నావంకే ఎగా దిగా చూస్తుంది. నేనూ చూశాను. ఆ గుర్తొచ్చింది. "కృష్ణ బావున్నావా" భుజంతడూ్త పలకరించాను.

"మీరు...మీరు కేశవరావుగారు కదూ" సందేహంగా అడిగాడు.

"అవునోయ్. అంతా బావున్నారా. ఏం చదువుతున్నావ్."

'ఇంటర్' నావంకే చూస్తూ చెప్పాడు.

"మీఅక్కకి పెళ్ళయిందా, పిల్లలెందరు?" అప్రయత్నంగానే నోట్నుంచి వచ్చేసింది.

ఎందుకనో మొహం మలినమైంది ఆ కుర్రాడికి. "మీరు అక్కకి బాగా తెలుసుకదూ. అయితే అక్కకి అంత అన్యాయం చేసిన రోగ్ ఎవరో కూడా తెలిసుండాలి. చెప్పరూ" ప్రాధేయపూర్వకంగా అంటున్న కృష్ణ కళ్ళు నీటిలో నిండిపోయాయి.

"అయితే మీ అక్క ఇప్పుడెక్కడుంది !" నా మనసంతా ఆందోళనతో గంద్రగోళంగా తయారైంది.

"మీరు చూస్తారా. వచ్చాక ఏం అనుకో గూడదు." తలూపక తప్పలేదు నా మనసులో ఒకేఆలోచన. నావల్ల శిధిలమైన ఆమె జీవితాన్నిచూసి భరించగలనా. ఏ మొహం పెట్టుకుని క్షమించమని అడగనూ. అంత చలిలోనూ దారి పొడవునా చిరుచెమటలు పట్టాయి. ఘాట్‌రోడ్ దాటి క్వారీ వేపుగా ఉన్న వీధిలోకి వెళ్ళాం. ఆ వరసంతా ఇళ్ళున్నాయన్నమాట అబద్ధం. నేలకంటుకుపోయిన గుడిసెలవి. వాటిల్లో ఒక తడిక నెట్టుకుని లోనికెళ్ళాడు కృష్ణ. గభాల్న లోనికెళ్ళే సాహసం లేక గుమ్మంలోనే నిల్చున్నాను. నీళ్ళ కడవ లోత్తడటం, మిగతా పన్లుకూడా మావేపి చుట్టుప్రక్కలవాళ్ళు వింతగా వచ్చే చూడ సాగారు. లోపల్నుంచి స్పష్టంగానే వినవస్తున్నాయి మాటలు. "ఒరే కృష్ణా ఎన్నిసార్లు చెప్పానురా ఇక్కడకు రావద్దని. మీ అక్క నికృష్టజీవితాన్ని చూసి భరించే ఓర్పు నీకు లేదురా నాయనా! చదువుకుని పైకి రావాల్సిన వాడివి. ఇలాటి మురికికూపంలోకి అడుగు బెట్టటం అంత ఆరోగ్యంకాదు. దయచేసి ఎప్పుడూ రావద్దు." ఏడుపు గొంతుతో అంటోంది రాజ్యం ఆ కంఠంలోని ఆవేదన నా హృదయాన్ని చీల్చేస్తున్నది. "అక్కా నీకై నువ్వు ఏ తప్పు చేయనప్పుడు ఎందు కక్కా ఈ శిక్ష. నేరం చేసినవాళ్ళు హాయిగానే ఉంటారు."

"లేదురా. తెల్లటివన్నీపాలేనని నమ్మాను. అనుభవిస్తున్నాను. పరువుకోసం ప్రాణమిచ్చే నాన్న నన్ను గెంటేయడంలో తప్పేంలేదు. వయసులో ఉన్న ఆడపిల్ల హద్దు దాటితే వచ్చే పర్యవసానం ఇదే వెళ్ళు వెళ్ళు. మళ్ళా ఎప్పుడూ ఇక్కడికి రానని ఒట్టువెయ్యి"

ఇంత కఠినంగా ఎలా మారిపోయావు రాజ్యం. నాలో నేనే గొణుక్కున్నాను.

'అక్కా నీ స్నేహితులొచ్చారు.'


'ఎవరు ?'

'కేశవరావుగారు.'

'కేశవరావా ?'

ఆ ఒక్కమాట చాలు ఆమె గుండెల్లో అగ్నిపర్వతాలు ప్రబద్దలవుతాయనడానికి తడికె నెట్టుకుని బైటకొస్తూ "మీరు మాట్లాడి రండి. నాన్న నాకోసం చూస్తారు." గబగబా వెళ్ళిపోయాడు.

లోనికి అడుగుబెడ్తుంటే కాళ్ళు వణికాయి. నన్ను చూడగానె పెద్దగా ఏడుస్తుందేమో ఎలా ఓదార్చాలా అని భయపడ్డాను.



అదేం లేదు. ఓ మూలగా ఉన్న స్టూలు గది వైపుకులాగి 'కూర్చోండి' అంది

పొయ్యిమీద టీకి నీళ్ళు పెట్టుకుందో ఏమో ఆవిర్లు చిమ్ముతోంది. "టీ తీసుకు రారా" చాలా సౌమ్యంగా అడిగింది అలా ఏం జరగనట్టు వుంటే బాధనిపించింది.

'రాజ్యం. ఏమిటీ అవతారం. ఇలా అయిపోయావేం.'

ఆ రూపం ఆకళ లేనేలేవు. ఎవరో కొత్త వ్యక్తిలా వుంది బొద్దుగా పచ్చగా ముద్ద బంతి పువ్వులా వుండే ఆ రాజ్యానికి గాలి వీస్తే ఎగిరిపోయేట్టుగా కళ్ళలో ప్రాణాలు పెట్టుకున్న ఈమెకి పోలికే లేదు. ఆ ఉత్సాహం కళ్ళలో కాంతికి బదులుగా విరక్తి నిర్లక్ష్యం తాండవం చేస్తున్నాయి. వెలిసిపోయిన వాయిల్ చీరలో రంగు వెలిసిన బొమ్మలా వుంది. నా మాటలో గమ్మత్తేం ఉందోగాని ఫకాల్న నవ్వి "ఎలా కనపిస్తున్నా కేశవా. బాగానే వున్నావే. పై పెచ్చు చాలా తెలివి మీరాను. చూశావుగా నా వైభవం' ఆ నవ్వు నా గుండెల్లో బాకులా గుచ్చుకుంది.

## నాకేం మిగిలింది ?

తలొంచుకుని కూర్చున్నాను. కాసేపటికి గాజు గ్లాసులో వేడి టీ చేతికిచ్చింది. అది ఆమె జీవితంలా చప్పగా ఉంది.

"ఏం అనుకోకు కేశవా. చక్కెర తక్కువైంది. నాలాగే అదీ."

బైటనుంచి ఎవరో పిల్చారు.

గుమ్మంబైట నిల్చునే మాట్లాడింది.

"ఏం చెల్లీ. ఇవాళ ప్రొద్దుటే బేరం తగిలిందల్లే ఉందే. పెద్ద కేసేలే. జారిపోకుండా చూసుకో" పకపకా నవ్వింది అవతలగొంతు.

గుండెల్లో అగ్నిపర్వతం ప్రబద్దలైంది. చివరికి రాజ్యం బ్రతుకిలా మారిందా. ఇదంతా నా వల్లనే అనుకుంటే మనసు చిత్రవధ పొందుతోంది. అగ్నిహోత్రుల ఇంట గారాబు పట్టిలా పెరిగిన రాజ్యం చివరికీ స్థితికి కారణం నేనా. తల పట్టుక్కూర్చున్న నన్ను చూసి నవ్వుతూ "నిజంగా నె పట్టి ఎవుతానను కునేవ్. శుభ్రంగా సంసారం చేసుకుంటున్న స్నేహితుణ్ణి ఈ రొంపిలోకి రమ్మంటానా. తప్పుకదూ ?" తమాషాగా కళ్ళెగరేస్తూ అంది

'ఎందుకిలా దిగజారావ్ రాజ్యం' బాధగా అడిగాను. "ఏనాడైతే ఆలోచించకుండా నీకు నన్నర్పించుకున్నానో ఆనాడే చెడిపోయాను కేశవా. అందుకు నిన్నిప్పుడు సంజాయిషీ అడగటంలేదులే ఆ పొరపాటుకు ఇంట్లోంచి వెళ్లగొట్టబడ్డ ఆడదాన్నా ఒంటరిగా మిగిలిపోయాను. ఈ భూమ్మీద బ్రతికున్నన్నాళ్ళూ ఈ పొట్టకోసం శ్రమపడక తప్పదు కదా. ఏపనికైనా వెళ్తే నాపనికన్నా నేనే నచ్చేదాన్ని వాళ్ళకి. రాబందుల కోరల్నుంచి ఎన్నాళ్లు దాక్కోగలను. అందుకే ఇలా వ్యాపారంలోకి దిగిపోయాను. నామీద నీకే మాత్రమైనా ఆశవుంటే ఓ రాత్రికి నువ్వొ కొనుక్కో !" ఇంత నిర్మొహమాటంగా చెప్పగలదనుకోలేదు.

పగిలే గుండెతో తడబడే కాళ్ళతో వచ్చేశాను.

"రేపొస్తాను రాజ్యం. ఆలోచించు. నీ బ్రతుక్కో మార్గం చూపుతాను. ఈ




Creative Unit-A 2330-Tel.

ఊబిని వదిలెయ్యి''మని ఎంత సేపు నచ్చజెప్పిన మీదట వచ్చేస్తూ అన్నాను.

ఎంతకీ వప్పుకోదేం. ఒకళ్ల సహాయం నాకఖ్కర్లేదంటుంది. ''నన్ను క్షమించలేవా'' రాజ్యం నోరు పెగుల్చుకుని అన్నా.

''క్షమించడానికి నేనెవర్ని కేశవా. అయినా అన్నివిధాల అన్యాయమైంది నేను. అరిటాకు సామెతలా అయింది బ్రతుకు. నిండా ఊబిలో దిగిపోయినన్ను పైకి లాగాలనుకోడం వృధా ప్రయాస. వెళ్ళిరా.''

ఇంటివరకూ నడిచే ఓపికలేదు నాకు రిక్షా చేసుకుని కూలబడ్డాను ఎలావచ్చానో ఇంట్లోకి ఎలానడిచానో నాకెతెలీదు. లత మాత్రం పట్టేసింది. ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తోచలేదు. కాని ఎవరితోనూ చెప్పుకోందే ఈ క్షోభ భరించలేను.

పెళ్లివాళ్లొచ్చేశారు. ఆ గొడవలో పడిపోయిన నా దగ్గరకొచ్చి 'అలా ఓసారి ఊళ్లోకి వెళ్ళొస్తానండీ. ఓ ఫ్రెండ్‌ని కల్సుకోవాలి' తయారై వచ్చే అంది.

'ఎక్కడికి ఈ ఊరు నీకు క్రొత్తకదా' ఆశ్చర్యపోయాను. మీకు ఓసారి చెప్పాను. ఈ ఊళ్లోనే నా పెన్ ఫ్రెండ్ ఉన్నది ఇన్నాళ్ళా ఉత్తరాలు వ్రాసుకోడమేగాని చూడలేదు. వస్తానని వ్రాస్తే అడ్రసిచ్చింది. సరిగ్గా పదింటికి కలుస్తానని వ్రాశాను. వస్తానూ' నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే వెళ్ళిపోయింది.

థాంక్‌గాడ్. ఈ పరిస్థితిలో నా మనోభావాలు కన్పించకుండా దేవుడే ఇలా ఆదుకున్నాడా అన్పించింది.

పెట్టిన శలవు పూర్తిగా వచ్చింది. రేపొద్దున్నే బండెక్కేద్దామనుకుంటున్నాం. ఈలోగా ఒక్కసారైనా రాజ్యాన్ని చూడాలంటే వీలుకాలేదు. ఎప్పుడూ ఎవరో ఒకరు వెంటే ఉండేవారు. తెలిసినవాళ్లతో వెళ్ల తగ్గ చోటు కాదది. లతకోసం చూశాను. ఎక్కడుందోగాని ఆ చుట్టాల్లో కన్పించలేదు. దగ్గర బంధువులు ఓ పదిమంది పైనే దిగబడ్డారు. లోపలికల్లా వెళ్లి చెప్పటం దేనికని చెప్పలేసుకుని నడిచాను. గ్యారేజి దాటుతోంటే కాళ్లు వణికాయి. గుండెల్లో ఏదో గుబులు. చెప్పలేని సందేహాలు ఎన్నో కదిలాయి.

ఒకసారి చూశాను కనుక తేలిగ్గానే గుర్తుపట్టాను. ఆ సందు మొదట్లో జేబు తడుముకుని కదిలాను. జేబులో రెండు వేలకు చెక్కుంది. నాపాపం దీంతో పరిష్కారమవుతుందా? రాజ్యానికో దారి ఏర్పడుతుందా? అసలు రాజ్యం దీనికంగీకరిస్తుందో లేదో తేలీదు.

గుమ్మంలోనిల్చుని తడిక నెట్టబోయి ఆగిపోయాను.లోపల్నుంచి బిగ్గరగానే మాటలు వినవస్తున్నాయి.

''రాజ్యం నామాటవినవూ.ఇన్నాళ్ళూ నిన్ను చూడక ఏవేవో ఊహించుకున్నాను. చూస్తే నా ఊహకీ నీకూ ఎంతవ్యత్యాసం ఇంతలేమిలో ఉండి కూడా నీ బుర్రలో అంత వున్నతమైన ఊహలున్నాయంటే నాకెంతో గర్వంగా ఉంది. ప్లీజ్. నాతోవచ్చేసేయ్. నాకు నువ్వేం బరువు కాదు రాజ్యం.'' ఆకంఠం విషాదమిళితమై జీరబోయినా ఎక్కడో విన్నట్టేవుంది.

'నన్ను బలవంత పెట్టకండి స్వర్ణా. మంచికో చెడుకో ఇలా మలచబడింది నా బ్రతుకు. ఇలాగే రాలిపోనీండి. ఈ నిప్పుల కుంపటిని మీ వెంట తీసుకెళ్తే మీకు మిగిలేవి అవమానాలు అవహేళనలూ' రాజ్యం అంటోంది.

> **గమనిక**
>
> ''మినీ యింటర్‌వ్యూలు'' అనేవి టపాలో వస్తే వాటిని స్వీకరించి వేయడం సాధ్యం కాదని మా యువ పాఠకులకు మనవి ... సం.

'లోకం మాటలకు నేను భయపడను రాజ్యం. మావారు కూడా ఇలాంటి విషయాలల్లో ఎంతో ఫార్వార్డ్‌గా ఉంటారు ప్లీజ్.'

'మంచితనంమీద నమ్మకంపోయిన నన్ను మళ్లీ మీ మంచితనంతో బలహీనం చేస్తున్నారు స్వర్ణా. ఒక మనిషి నన్నీ స్థితికి తెచ్చాడు. మరో మనిషి నీకూ మంచిరోజులు తెస్తానంటున్నది. ఎంత చిత్రంగా వుంది నా జీవితం. సారీ స్వర్ణా. నన్నిలాగే ఉండనీ.'

చాలాసేపు నిశ్శబ్దంగా గడిచింది. ఇలా వీధిలో నుంచుంటే ఏదోలా వుంది. ఆవిడెవరో బైటకొస్తే బావుణ్ణు. విసుక్కుంటూ సిగరెట్ తీశాను.

''పోనీ నిన్నీ స్థితికి దిగజార్చిన ఆ దుర్మార్గుడెవరో చెపుతావా, ఎక్కడుంటాడో ఏం చేస్తాడో అవన్నీ చెప్పు.''

చిన్నగా నవ్వుతూ ''ఏం చేస్తావ్. పట్టి లాక్కొస్తావా; అది సాధ్యం అయినా నేనతన్ని క్షమించను స్వర్ణా.''

'జీవితంలో ఎప్పుడైనా ఎక్కడైనా తటస్థపడితే నాలుగూ కడిగేస్తాను. దేవత లాటి నిన్నిలా ఎందుకూ కాకుండా చేసిన ఆ చవట.'

విన్లేక చెవులు మూసుకున్నాను. మైగాడ్! ఈవిడెవరో నేను కన్పిస్తే రాజ్యం కాళ్లు పట్టించేలా వుంది. వెనక్కి తిరిగి వెళ్లిపోదామా అన్పించింది. కాని రేపే పయాణం. ఇప్పుడుకాకుంటే జీవితంలో మరికొన్నేళ్లవరకూ రానెమో. అప్పటికి మా ఇద్దర్లో ఎవరు మిగిలేను. నా నేరానికి క్షమాపణ చెప్పుకునేవరకు నాకు విశ్రాంతి లేదు.

పెట్లోంచి ఏదో తీస్తున్నట్టుగా చప్పుడు.

'ఇదిగో. ఇతనే ఆ మహానుభావుడు బాగా చూడు. అంతేగాని నలుగుర్లో కడిగెయ్యకు స్వర్ణా పాపం బాగా పరువుగల పెద్దమనిషి.'

''ఇంతచేసినా ఆ వెధవమీద అభిమానం పోలేదే'' నవ్వుతూ అన్నదల్లా టక్కున నవ్వాపేసింది.

ఆవిడ విసిరేసిన ఫొటో తడిక నెట్టుకుని నా కాళ్లదగ్గర పడింది. రాజ్యం ఆనాటి నుంచీ ఈఫొటోని భద్రంగా దాచుకున్నావా. అనంతమైన నీ ప్రేమని గుర్తించలేక పారిపోయిన మూర్ఖుణ్ణా నేను. ఆవేదనతో మనసు తల్లడిల్లి పోయింది.

ఇహ వెయిట్‌చేసే ఓర్పు లేకపోయింది.

ఓరగావేసిన తడిక నెట్టుకుని లోనికెళ్లి హతాశుణ్ణయాను.

ఎదురుగా లత.

అప్పటికి గుర్తొచ్చింది ఆమె పేరు స్వర్ణలత అని.

గొంతు పెగల్చుకుని లతా అన్నాను.

లత కళ్లు అప్పటికే నిప్పులు వెదజల్లుతున్నాయి. నన్ను చూస్తూనే అసహ్యంగా మొహంపెట్టి 'ఛీ' అంటూ బైటకు పరుగెత్తింది. ఆమె వెనుకే పరుగెత్తిన రాజ్యంతో కూడా చెప్పకుండా నోట్లో కొంగు కుక్కుకుని వెళ్లిపోతున్న లత వంక నావంకా మార్చి మార్చి చూడసాగింది రాజ్యం.